# సింగిల్ పేజీ కథలు

## కన్నతండ్రికో లేఖ

ప్రియమైన నాన్నా!

ఈ లేఖ నీవు పూర్తిగా చదవాలి. చూడగానే ఆవేశంతో చించి ముక్కలు చేశావనుకో.. నీ ఆవేశం నీకు పశ్చాత్తాపాన్ని మిగుల్చుతుంది.

నేను నీ కన్నకూతురినీ- నువ్వు నీ గుండెల మీద ఆడించిన నీ ఆశాదీపాన్ని.

ఇప్పుడు నీకు నాపై ఎంత కోపంగా వుందో నాకు తెలుసు. అయినా సరే.. ఈ లెటర్ పూర్తిగా చదువు.

నాన్నా! అమ్మ నీకెన్నోసార్లు చెప్పింది. రాజీ మాటకి విలువనివ్వండి.. పిల్లలంటే బొమ్మలు కాదు, ఆడుకోవటానికి.. పిల్లలంటే బరువులు కాదు.. దించేసుకోవటానికి అని.

నువ్వు అమ్మ మాటకి విలువిచ్చావా- లేదు. అసలు నీకు అమ్మంటే గౌరముందా? లేదు. అభిమానం, ప్రేమ ఉన్నాయా అసలు. గుండెల మీద చెయ్యేసుకుని చెప్పు.

నీకు కోపం వస్తే అమ్మ గజగజ వణికిపోవాలని ఎక్స్‌పెక్ట్ చేస్తావు. నీకు జ్వరం వస్తే అమ్మ నీకోసం కన్నీరుమున్నీరుగా విలపిస్తూ నీకు సేవలు చేయాలనుకుంటావ్- నీ మాటకి అమ్మ వత్తాసు పలకాలనుకుంటావ్- మీ మనసు ఏం చెబితే అమ్మ అందుకు తందానా తానా అనాలని అనుకుంటావ్- నీముందు అమ్మ బానిసగా తల వూపుతూ నిలుచోవాలనుకుంటావ్-

నీ దృష్టిలో నువ్వొక పర్‌ఫెక్ట్ పర్సనాలిటీ- ఏమిటి నువ్వు సాధించగలిగింది. నీ కాళ్లకు నువ్వు నమస్కరించుకుంటే సరిపోతుందా?

నువ్వు నోబుల్ బహుమతి గ్రహీతవా? కనీసం నీ వూరి ప్రెసిడెంటువా? హీనపక్షం నీ వీధిలో పెద్దమనిషివా?

ఏమీ కాదు- నువ్వు నీ దృష్టిలో దైవం- కానీ, నువ్వెంత అజ్ఞానివి.

నాకు నువ్వు స్వేచ్ఛనివ్వడం అవసరమని ఎప్పుడైనా భావించావా? లేదు. నీ కొడుకులకి పూర్తి స్వేచ్ఛనిచ్చి- నన్ను మాత్రం సంకెళ్లలో బంధించావు.


నాపై అనుమానం- నా ఫ్రెండ్స్ ఎవరు, ఎలాంటి వారు, అబ్బాయిలా, అమ్మాయిలా? నేను ఎటు వెళుతున్నాను.. నిత్యం నాపై గూఢచర్యం. ఎందుకు?

ఒత్తిడి అధికమైనకొద్దీ... రిలీఫ్ కోసం తాపత్రయం రెట్టింపవుతుంది.

అందుకే నువ్వు మాపై అధికారం, పెత్తనాల ఇనుప పాదం మోపినప్పటినుండీ.. నిన్ను వ్యతిరేకించాలనీ, నీ మనసు గాయపర్చే పనులు చేయాలనే ఆకాంక్ష నాలో మొదలైంది.

అందుకే నేను నా మనసుకు నచ్చినవాడిని ప్రేమించాను. అతను నాకు గౌరవం ఇస్తాడా- ఇవ్వడా అని చూశాను. నాకన్నా కొంచెం ఉన్నతస్థానంలో వున్నవారు నన్ను చీప్‌గా చూస్తారని నాకు తెలుసు. అందుకే నా చదువు, హోదాల కన్నా తక్కువ స్థానంలో వున్నవాడిని ఎన్నుకున్నాను. పెళ్లి చేసుకున్నాను.

ఇది నీమీది కోపంతో చేసిన పని మాత్రం కాదు.



నువ్వు నీ స్వార్థం కోసం, నీ ప్రతిష్ఠ కోసం, సమాజంలో నీ గౌరవం పెరగడం కోసం ఎవడ్నో నా భర్తగా డిసైడ్ చేశావ్...

కానీ, దాన్ని నా మనసు ఎలా వప్పుకుంటుంది? వ్యతిరేకించడం తప్పనిసరైంది. నాన్నా.. నీకు నేను శత్రువును కాదు. నీ కన్నకూతురిని.

నువ్వు నాకు శత్రువుగా ఎందుకు మారావు?

ఈ పాయింటుపై నీ ఆలోచనలు ప్రారంభించు.

పోనీ... ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పు.. అమ్మనెందుకు నీ బందీగా, బానిసగా చూశావు? చేశావు?

కోపం వస్తోందా?

వస్తుంది- ఇదంతా నీ పురుషాహంకారాన్ని నిలదీస్తున్న వ్యవహారం కదా- తప్పక వస్తుంది.

సరే- నేను పెళ్లి చేసుకున్నాననుకో- దానివల్ల నీకు జరిగిన, జరుగుతున్న నష్టమేమిటి? పైపెచ్చు రెండుల క్షల రూపాయల కట్నం మిగిలింది.

కానీ, ఇప్పటికైనా కళ్లు తెరువు నాన్నా..

నీ వయసు ఇప్పుడు యాభై అయిదు, ఇంకా రిటైర్ కాలేదు.

రేపు రిటైరయ్యాక నీ ఇద్దరు కొడుకులు నీ ఆస్తి మొత్తం తమకు దక్కడానికి కసరత్తులు ప్రారంభిస్తారు.

నిన్ను ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురిచేసి, నిన్ను అశాంతికి గురిచేసి, చివరికి నీ ఆస్తి కాజేస్తారు.. ఇది వాస్తవం-

అప్పుడు నిన్ను కనీసం ప్రేమగా 'నాన్నా' అని పిలిచేదెవరు? నీ గురించీ, అమ్మ గురించీ పట్టించుకునేదెవరు? మీకు కష్టం వస్తే మీకోసం రెండు కన్నీటి బొట్లు రాల్చేదెవరు?

అప్పుడు.. కనీసం అప్పుడైనా నేను నీకు గుర్తొస్తాను. నాన్నా.. ఇకనైనా ఈ అర్థం పర్థం లేని ఆవేశాలు మానేయ్.. నన్ను మనసారా ఆశీర్వదించు... నీకు తెలియటం కోసం రాయవలసి వచ్చింది. గుడ్డొచ్చి పిల్లనెక్కిరించటం అంటే ఇదే అని కినుకపడబోకు-

మరోమాట- ఆడపిల్ల ఎప్పటికీ తల్లిదండ్రుల యోగక్షేమాలనే కోరుకుంటుంది. కారణం... ఆడదానికే మనిషికి జన్మనిచ్చే బాధ తెలుసు. ప్రేమ తెలుసు.

ఇప్పటికైనా నీవు నీ మనసు మార్చుకుని మమ్మల్ని ఆశీర్వదిస్తే.. అదే మాకు సంతోషం.

నేనూ తల్లినవబోతున్నాను. నాకన్నబిడ్డలకే నాడూ ఇలాంటి అవస్థలు రానీయను. ఉంటా న్నాన్నా...

ఇట్లు,
నీ ప్రియమైన కూతురు,
రాజీ.

* * *

టెలిగ్రాం-
'రాజీ... నేనూ, అమ్మా బయల్దేరి వస్తున్నాం.'
నాన్న,
విశ్వనాథం.

**-కె.లక్ష్మీకాంతమ్మ (నెల్లూరు)**